విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

‘అడుగుదాం ఆంధ్రా...’ సభ విజయవంతం చేయాలి : కొనకళ్ల

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దగా పడిన ప్రతి యువత మేలుకో అంటూ కృష్ణా జిల్లా తెలుగు యువత అధ్యక్షులు దండ మూడి చౌదరి ఆధ్వర్యంలో మాజీ ఎంపీ, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు ముఖ్య అతిధిన ఫిబ్రవరి 25 న కృష్ణా జిల్లా టీడీపీ యువత ఆధ్వర్యంలో అడుగుదాం ఆంధ్రా... భారీ బహిరంగ సభ నిర్వహిస్తారని ఈరోజు మచిలీపట్నం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో కొనకళ్ళ నారాయణరావు, దండమూడి చౌదరి తెలిపారు. అనంతరం అడుగుదాం ఆంధ్రా... సభకు సంభంధించిన పోస్టర్‌ని కూడా విడుదల చేశారు... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో అబద్ధపు వాగ్దానాలతో రాష్ట్రంలోని యువత ఓట్లను కొల్లగొట్టాడు. తాను అధికారం వచ్చిన తర్వాత రాష్ట్ర యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇస్తానని ఇవ్వకుండా యువతను మోసం చేశారని అన్నారు. ఈ విధంగా రాష్ట్రంలో దగా పడిన ప్రతి యువతను మేలుకొలుపుతూ ఫిబ్రవరి 25వ తారీఖున ఉయ్యూరు జంక్షన్లో యువత కోసం యువత భవిష్యత్తు కోసం కృష్ణాజిల్లా తెలుగు యువత ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ జరుగనున్నదని దీనికి ముఖ్యఅతిథిగా ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొని యువతకు అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ

కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ జగన్నాధరావు (బుల్లయ్య), రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు హనీమ్ బేగ్,జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు మండవ అనీష్, జిల్లా కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

15న అగ్రిగోల్డ్ బాధితుల న్యాయపోరాట దీక్షను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెడన: ఎన్నికల ముందు అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటా నని చెప్పి అధికారంలోకి వచ్చాక సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదుకోలేదని అగ్రిగోల్డ్ బాధితులు వాపోయారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో 1వ వార్డులో పేరిశెట్టి గోవర్ధనరావు ఇంటి వద్ద నిర్వహించిన ఈ సమావేశానికి కాకర్ల కోటయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి పాద యాత్ర చేస్తున్న సమయంలో 2017లో ఆమరణ నిరాహార దీక్షకు వచ్చి మన ప్రభు త్వం అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో బాధితులకు రావాల్సిన కోట్ల రూపాయలు విడుదల చేస్తానని చెప్పి చనిపోయిన బాధితులకు 10 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు బాధితులను పూర్తిగా మర్చిపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు మాట్లాడుతూ సీఎం జగన్ అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని చెప్పి కనీసం ఆఖరి బడ్జెట్‌లో కూడా వారికి డబ్బులు కేటాయించలేదని అగ్రిగోల్డ్ బాధితులను అన్యాయం చేశారని ఆయన అన్నారు. ఈనెల 15వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ లో జరగబోయే అగ్రిగోల్డ్ బాధితుల న్యాయపోరాట దీక్షలో మండలంలోని బాధితులు అందరూ పాల్గొని ఈ దీక్షను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.గగన్, సీపీఐ నాయకులు కట్టా. హేమ సుందర్‌రావు, బాధితులు ఎండి సిరాజ్, రొంపిచర్ల పార్థసారథి, కొసనం వాసు, కె.శ్రీనివాస్, నాగరాజు, యర్రా గాంధీ, గోవు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల పోరాటదీక్షలో భారీగా పాల్గొనాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఈనెల 15న న్యాయ పోరాట దీక్ష కోసం స్థానిక మోదుమూడి శ్రీహరి రావు భవనంలో అగ్రిగోల్డ్ బాధితుల అసోసియేషన్ సభ్యుడు వితం శెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కారు పర్తి గగన్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థ చేసిన మోసానికి గత 9 సంవత్సరాలుగా రోడ్డున పడుతున్న మనీ, మమ్ములను ఆదుకుంటానని మన ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల లోపు పూర్తిగా బాధితులకు డబ్బులు చెల్లిస్తానని నమ్మించి ఓట్లు వేయించుకున్న వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆఖరి బడ్జెట్ లో కూడా బాధితులకు డబ్బులు కేటాయించకపోవడం నైవంచన చేయడమేనని ఇందుకు నిరసనగా ఈనెల 15వ తేదీ నుండి విజయవాడ ధర్నా చౌక్ లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అగ్రిగోల్డ్ బాధితుల అందరూ ఈ న్యాయ పోరాట దీక్షకు పాల్గొని ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. 2017లో బాధితులు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సమయంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి దీక్షా శిబిరానికి వచ్చి చనిపోయిన అగ్రిగోల్డ్ బాధితులకు ఈ ప్రభుత్వం మూడు లక్షల మాత్రమే ఎక్స్‌గ్రేషియా ఇస్తుందని మన ప్రభుత్వం వచ్చిన తర్వాత వీరందరికీ మరో ఏడు లక్షలు కలిపి మొత్తం పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తానని హామీ ఇచ్చి అసెంబ్లీలో లక్ష కోట్లు బడ్జెట్ పెట్టిన చంద్రబాబు ప్రభుత్వం 3 వేల కోట్లు ఎందుకు ఇవ్వలేదని, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చే ఐదు సంవత్సరాలు పూర్తయిన 5 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టిన అగ్రిగోల్డ్ బాధితుల మూడు వేల కోట్లు ఇవ్వకపోవడం బాధితులకు ద్రోహం చేయడం కాదా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కేసనం వాసు, తాడేపల్లి రేవతి కుమార్, పరస ఆంజనేయులు, సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, లింగం ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

16న కార్మికుల ఆందోళన

విశాలాంధ్ర-కూచిపూడి : “కేంద్ర బిజెపి కార్పొరేట్-మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాంయిమోడీ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జి షీట్ ప్రకటిద్దాం” అంటూఈనెల 16 నిర్వహించే దేశవ్యాప్త కార్మికుల ఆందోళన-గ్రామీణ భారత్ నిరసనలలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని జాయింట్ ప్లాట్.ఫామ్.ఆఫ్ ట్రేడ్ యూనియన్ నేతలు పిలుపునిచ్చారు. కూచిపూడి-పెదపూడి సెంటర్లోని చలసాని కాంచనరావు భారత కమ్యూనిటీ పార్టీ (సీపీఐ) కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ, సిఐటియు నేతలు దీనికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16న జరిగే దేశవ్యాప్తంగా రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమంలో భాగంగా మొవ్వ మండలంలోని నిడుమోలు ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. 16వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, వివిధ సంస్థలలో పనిచేసేకార్మికులు, ఉద్యోగులు, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. అలాగే ఫిబ్రవరి 16 న రాష్ట్రంలో సంక్షేమ బోర్డు కొనసాగింపునకు కృషి చేయాలని కోరుతూ భావన నిర్మాణ కార్మికులు, అలాగేరవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద క్రిమినల్ చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ నిర్వహించే దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని వారు పులుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి చందోలు నాగేశ్వరరావు, ఏఐటీయూసీ ప్రతినిధి కొండా నాగేశ్వరరావు, కుమార్ రాజు, కృష్ణాజిల్లా కౌలు రైతు సంఘం సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, కృష్ణా జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు ఓ. గంగాధర్, పంచాయితీ కార్మిక సంఘ మండల అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసరావు,, సిఐటియు ప్రతినిధి కొడాలి గంగాధరరావు పాల్గొన్నారు.

కార్మికుల ఆందోళన విజయవంతం చేయండి

విశాలాంధ్ర-గుడివాడ : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా వామపక్షాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16వ తేదీ నిర్వహించే ఆందోళన, నిరసనలను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల నాయకులు గూడపాటి ప్రకాష్‌బాబు, ఆర్‌సిపి రెడ్డిలు పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక అంజనేయపపేటలోని సుందరయ్య భవనంలో వామపక్షాల నాయకులు ఈ నెల 16వ తేదిన జరిగే బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టరలను అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ - మతతత్వ విధానాలను వ్యతిరేకించాలన్నారు. మోడీ ప్రభుత్వ వైపల్యాలపై చార్జ్‌షీట్ ప్రకటిద్దామన్నారు. ఈ నెల 16వ తేదిన జరిగే కార్మికులు సమ్మె, గ్రామీణ భారత్ బందు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, రేపాని కొండ, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : ఓటర్లకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశాల మేరకు ఎన్నికల విభాగం మచిలీపట్నం కలెక్టరేట్ ఆవరణలో నమూనా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా యువ ఓటర్లు తొలిసారి ఓటు వేసే వారికి ఓటు హక్కు వినియోగించుకోవడం, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన సౌకర్యాలు, ఓటర్ల జాబితాలో తమ పేర్లు పరిశీలించుకోవడం తదితర విషయాల పట్ల అవగాహన కల్పించడం జరుగుతున్నది. ఇందులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ లోని నమూనా పోలింగ్ కేంద్రాన్ని స్థానిక నోబుల్ కళాశాల విద్యార్థులు సందర్శించారు. నమూనా పోలింగ్ కేంద్రంలోని సిబ్బంది అనిత విద్యార్థులకు ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానం పట్ల అవగాహన కల్పించారు.

రక్తదానంను కొనసాగించాలి : వీసీ జ్ఞానమణి

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: కృష్ణా విశ్వవిద్యాలయం: రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలు కాపాడిన వారుగా వుంటారని, అందువల్ల దానిని ఒక వ్యసనంగా అలవాటు చేసుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి పిలుపునిచ్చారు. మంగళవారం కృష్ణా విశ్వవిద్యాలయ ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్, రెడ్ క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి ప్రారంభించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ కృష్ణా విశ్వవిద్యాలయం లో నిరంతరం రక్త దాన కార్యక్రమాలు నిర్వహించటం చాలా గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఏ ఇతర విశ్వవిద్యాలయలో ఇలాంటి సేవా కార్యక్రమాలు తాను చూడలేదన్నారు. ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు రక్త దానం పై అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువ మంది విద్యార్థులు ముందుకు వచ్చేలా చూడాలి అని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో 40 యూనిట్ల రక్తం ను సేకరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా పి వీర బ్రహ్మచారి, రెడ్ క్రాస్ కార్యదర్శి శంకర్ నాథ్, కోశాధికారి బాలాజీ, అసోసియేట్ ఎన్ సి సి అధికారి డా రామశేకర్ రెడ్డి, రెడ్ క్రాస్ వైద్యులు డా హనుమంతయ్య, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

16న సమ్మె జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గన్నవరం : రైతు కార్మిక కుల వ్యతిరేక విధాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలని జిల్లా రైతు నాయకులు ముక్కమాల ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం గన్నవరం సీపీఎం కాయలయంలో సీపీఐ సీపీఎం, తెలుగుదేశం ట్రేడ్ యూనియన్స్ రైతు సంఘాలు ఈ నెల 16 తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరవు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 10 సంవత్సరాలు వచ్చిన రైతు కార్మిక వర్గ సమస్యలు పరిష్కరించని కేంద్రప్రభుత్వం అని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు దోచిపెటెందుకు కుట్ర పనుతుందన్నారు. రైతు నాయకులు కాట్రగడ్డ రామచంద్ర జోషి మాట్లాడుతూ కేంద్రం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. కనీస వేతనం 26 వేలు నిర్ణయించటంలో కేంద్రం అంగీకరించటం లేదని అన్నారు. బంద్‌ను రైతు కార్మిక సంఘాలు జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రైతు సంఘం నాయకులు శనగల సుబ్బారెడ్డి, నూతక్కి మోహన్‌రావు, కట్టవరపు విజయరావు, సి హెచ్ వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు యం ఆంజనేయులు, కళ్ళం వెంకటేశ్వరరావు, అనుమోలు వెంకటేశ్వరరావు, మిరప నాగేశ్వరరావు, సాంబశివరావు, టీడీపీ నాయకులు దొంతు చిన్న బూసే నాగ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-అవనిగడ్డ : అగ్ని ప్రమాద బాధితులకు పలువురు దాతలు సాయం అందించి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. సోమవారం పంచాయితీ పరిధిలోని వసుమట్ల కాలనీలో విద్యుత్ షాట్ సర్క్యూట్ కారణంగా పొనుగుపాటి వీర రాఘవులు, పొనుగుపాటి ఏడుకొండలకు సంబంధించిన గృహాలు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో విషయం తెలుసుకున్న శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు బాధితులను పరామర్శించి 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, వైస్ ఎం.పి.పి పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పులిగడ్డ ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావులతో పాటు పలువురు పాల్గొన్నారు. జనసేన నాయకులు, అక్షయ డెవలపర్స్ అధినేత మాదివాడ వెంకట కృష్ణారావు అగ్ని ప్రమాధ బాధితులను పరామర్శించి 10 వేల రూపాయలు, ఇటీవల మరణించి ఆరిగ సువర్ణరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి తన వంతు సాయంగా 5 వేల రూపాయలను ఆర్థిక సాయం అందించి మీకు అండగా మేము ఉన్నామని భరోసా కల్పించారు. జనసేన నాయకులు ప్రముఖ కాంట్రాక్టర్ విక్కుర్తి శ్రీనివాస్ తరుపున వారి సోదరుడు విక్కుర్తి రాంబాబు అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించి 10 వేల రూపాయలను ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష్యులు గుడివాక శేషుబాబు, ఎం.పి.టి.సి సభ్యులు బొప్పన బాణు, పులిగడ్డ గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు మండలి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వినర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు.

ఇన్‌స్పెయిర్ మానక్ అవార్డుకు విద్యార్థి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- 2023-24 విద్యాసంవత్సరానికి ప్రభుత్వం ప్రకటించిన ఇన్ - స్పైర్ మానక్ అవార్డుకు స్థానిక కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ విద్యార్థి కాగిత ప్రభు విశాల్ (8) ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ తెలిపారు. ఈ విద్యార్థి సృజనాత్మకమైన ప్రాజెక్టును తయారుచేసి ఇన్ - స్పైర్ మానక్ ఎగ్జిబిషన్ నందు ప్రదర్శించేందుకు విద్యార్థి బ్యాంకు ఖాతాలో రూ.10 వేలను ప్రభుత్వం జమచేస్తుందన్నారు. విద్యార్థి కాగిత ప్రభు విశాల్ ను పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ ,పాఠశాల కరస్పాండెంట్ కె ఎస్ వి జి శోభ ,ఉపాధ్యాయిని ,ఉపాధ్యాయులు ,విద్యార్థిని ,విద్యార్థులు ,పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

‘ఆకాష్’లో జేఈఈ విజేతల సంబరాలు

విశాలాంధ్ర- విజయవాడ(వన్‌టౌన్): అక్కడ సంబరాలు మిన్నంటాయి! ఉత్సాహంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎంతోమంది విద్యార్థులకు స్ఫూర్తినిచ్చాయి. ఈ సన్నివేశం ఇంకెక్కడో కాదు మన విజయవాడ బెంజ్ సర్కిల్ నందు గల ఆకాష్ విద్యాసంస్థల ప్రాంగణంలోనే..... ప్రస్తుతం విడుదలైన జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాలలో విజయవాడకు చెందిన ఐదుగురు ఆకాష్ విద్యార్థులు 99 శాతానికి పైగా మార్కులు సాధించిన వారిని స్థానిక అకాడమిక్ విభాగం ఘనంగా సత్కరించింది. మంగళవారం ఉదయం ఆకాష్ బెంజిసర్కిల్ కేంద్రంలో మేళ తాళాలతో అభ్యర్థులను అభినందించారు. పూలమాల, దుస్సాలువ, పుష్పగుచ్ఛాలు ఇచ్చి సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ఆకాష్ బైజుస్ విజయవాడ హెడ్ జామి నారాయణమూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ నరేష్, ఏరియా సేల్స్ హెడ్ రవి, ఏరియా ఆపరేషన్స్ హెడ్ అర్జున్ మరియు బ్రాంచ్ హెడ్ గోపి తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నాట్యంలో ఎంపిఏ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళాపీఠంలో ఈనెల 20వ తారీకు వరకు జరిగే థియరి, ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా మంగళవారం ఎం పి ఏ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం పూట నిర్వహించినమొదటి సంవత్సరంలో 18 మంది,, మధ్యాహ్నం నుంచి నిర్వహించిన రెండవ సంవత్సరంలో పదిమందికి పైగా హాజరైన ఈ పరీక్షలకు అధికారులుగా నాట్యాచార్యఏలేశ్వరపుపూర్ణచంద్ర రావు(ఉదయం), నాట్యాచార్య ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు(మధ్యాహ్నం) కొనసాగారు. ఈ విద్యార్థులకు నట్వాంగాన్ని కళాపీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు నిర్వహించగా గాత్రంపై డాక్టర్ వేదాంతం వెంకట దుర్గా భవాని, మృదంగంపై పసుమర్తి హరినాథ శాస్త్రి సహకరించారు. ఈ పరీక్షలకుకళా పీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి చీఫ్ సూపరింటెండెంట్ గా వ్యవహరించారు.

బీజేపీ సీనియర్ నేత మామిడి వాసుదేవరావు మృతి

విశాలాంధ్ర-పెడన : భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు పెడన పట్టణ మాజీ అధ్యక్షులు మామిడి వాసుదేవరావు మృతి చెందారు. ఆయన కుమారుడు మామిడి గుప్తా ప్రస్తుతం. పట్టణ అధ్యక్షులుగా పని చేయుచున్నారు. భారతీయ జనతా పార్టీ పెడన నియోజవర్గ నాయకులు, కృష్ణాజిల్లా బిజెపి నాయకులు వాసుదేవరావు పార్థివ దేహానికి పార్టీ జెండాను కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కృష్ణా జిల్లా జనరల్ సెక్రెటరీ పుప్పాల రామాంజనేయులు, జిల్లా సెక్రెటరీ గాజుల సిద్దార్థ, పెడన నియోజవర్గ కన్వీనర్ పడవల కొండలరావు, బంటుమిల్లి మండల అధ్యక్షులు బండ్రెడ్డి ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ సీనియర్ నాయకులు కట్టా. జ్యోతి శ్వరరావు,యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రత్తిపాటి వెంకటరమణ, మాజీ అధ్యక్షులు పిచ్చుక.శంకర్, ఆర్కే గుప్త నాయకులు కార్యకర్తలు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు

కొడాలిలో పోలింగ్ బూత్ పరిశీలన

విశాలాంధ్ర-ఘంటసాల: మండల పరిధిలోని కొడాలి లోని పోలింగ్ కేంద్రాన్ని అధికారులు మంగళవారం పరిశీలించారు. ప్రజలు ఓట్లు వేసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని క్రింది స్థాయి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి శేషమాంబ, జడ్పిటిసి సభ్యులు తుమ్మల మురళీకృష్ణ, సీఐ నాగప్రసాద్, ఇంచార్జి ఈవోపీఆర్డి బి.అర్జునరావు, పంచాయతీ కార్యదర్శి సిహెచ్ వివిఎస్. నాగమణి, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి, మండల పరిషత్ సూపరిండెంట్ శ్రీనివాస చందు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పల్లెబాట, పల్లెనిద్ర

విశాలాంధ్ర-పెదపారుపూడి : టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా పల్లెబాట, పల్లెనిద్ర మూడవరోజు తంబలంపాడులో పల్లెనిద్ర తర్వాత ఆ గ్రామస్తులతో మాటామంతి జరిగింది. అనంతరం దోసపాడు, దూళ్ల వానిగూడెం, మహేశ్వంపురం, గురువిందగుంట, గ్రామాలలో ప్రజల సమస్యలు తెలుసుకున్నట్లు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండపనేని శ్రీనివాసరావు, సజ్జ శివకుమార్, దానబోయిన వెంకటనారాయణ, కలపాల కిషోర్, జుజ్జువరపు బాజీ, చందలూరి విజయ శంకర్,గోగం రామారావు, మహిళలు పాల్గొన్నారు.

రైతు ప్రముఖుడు, ల్యాండ్ లార్డ్ గోపాలకృష్ణయ్య కన్నుమూత

విశాలాంధ్ర-అవనిగడ్డ : దివిసీమ రైతు ప్రముఖుడు ల్యాండ్ లార్డ్ కమ్మిలి గోపాలకృష్ణయ్య (85) మంగళవారం ఉదయం అవనిగడ్డలోని స్వగృహంలో కన్ను మూశారు. గోపాలకృష్ణయ్య పలు సేవా సంస్థలతో అనుబంధం ఉండి స్వచ్ఛందంగా సేవలందించారు. అవనిగడ్డ శిశు విద్యామందిరం, గీతా మందిరం అభివృద్ధి కమిటీ సభ్యులుగా గోపాలకృష్ణ వ్యవహరించారు. ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల రైతు విభాగ ఇన్‌చార్జ్ కడవకొల్లు నరసింహ రావు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు సందర్శించారు. సంతాపం వ్యక్త పరిచి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గోపాలకృష్ణయ్యకు భార్య, ఐదుగురు కుమార్తెలు.

పూరిళ్లు దగ్ధం- 5 లక్షల ఆస్తి నష్టం

విశాలాంధ్ర-అవనిగడ్డ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గృహాలు పూర్తిగా కాలిపోగా 5 లక్షల రూపాయలు నష్టం వాటిలినట్లు స్టేషన్ ఫైర్ అధికారి పి.ఎస్.వి.వి ప్రసాద్ మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి అవనిగడ్డ సివారు వసుమట్ల కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు పూరిళ్ళు అగ్నికి ఆహుతి అయ్యాయని ఇరు కుటుంబాల సభ్యులు కట్టుబట్టలతో మిగిలారని, అయితే చుట్ట పక్కలకు మంటలు ఎగబాకకుండా అదుపు చేశామని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లపై ఆగ్రహం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం సాయంత్రం వాడి వేడిగా జరిగింది. ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు, ధాన్యం కొనుగోలు సిబ్బంది కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధర రాకుండా ఇబ్బందులు పాలు చేస్తున్నారని మండల పరిషత్ ఉపాధ్యక్షులు కందుల వెంకట కోటేశ్వరరావు (కొండలు), సర్పంచులునాగన బోయిన సునీల్ కుమార్ (అయ్యంకి), పంది కృష్ణ (మంత్రి పాలెం), వేములమడ సీతారామయ్య (వేములమడ), తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దీనిపై రైతులు అడిగినా ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది సమాధానం చెప్పకపోగా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని వెల్లడించారు. ధాన్యం తేమ శాతం పై కూడా తేడాలు చూపించి మద్దతు ధరలో కోత విధిస్తుతున్నారని పేర్కొన్నారు. దీనితో రైతులువేలాది రూపాయలు రైతులు నష్టపోయే పరిస్థితి సంభవించిందని వెల్లడించడంతో డిప్యూటీ తాసిల్దార్ సిహెచ్ గోపాలరావు, మండల వ్యవసాయ అధికారి కంచర్ల శివప్రసాద్ దీనిపై తాము సమాచారం సేకరించి తగు చర్యలు చేపడతామన్నారు. ఐలూరు నుంచి విడుదలయ్యే కృష్ణా జలాల తాగునీరు మా గ్రామాలకిరాదాంటూ పెదసనగలు సర్పంచ్ కైతేపల్లి అన్నామణి, వేములమడ సర్పంచ్ సీతారామయ్య ప్రశ్నించారు. జల జీవన్ మిషన్ ద్వారా పనులు పూర్తిచేసి తాగునీరు గ్రామాలకు ఎప్పుడు సరఫరా చేస్తారని, పెదముత్తేవి ఎంపిటిసి సభ్యురాలు ఉప్పలపాటి జ్యోతి తదితరులు ప్రశ్నించారు.. దీనిపై ఆర్ .డబ్ల్యు.ఎస్.ఏ.ఈ. కె ఎస్ ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలు పర్యవేక్షణలో త్వరలో పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఏజెండాలో పొందుపరిచిన అంశాలను ఆయా శాఖల అధికారులు వెల్లడించారు. ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పిటిసి రాజులపాటి పార్వతి, ఎం.డి.ఓ. జి. చంద్రశేఖర రావు, కృష్ణాజిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు పాల్గొన్నారు

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు అయిన మాగంటి గోపాలకృష్ణ, తండ్రి వెంకటేశ్వరరావు, నివాసం : యుఎస్ఏ, రిప్రజెంటెడ్ బై జిపిఏ హోల్డర్ నర్రా లక్ష్మీనారాయణ, తండ్రి కుమారస్వామి, నివాసం : డో.నెం.5-144, వణుకూరు, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా వారి సంజాయిషీ పొంది ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా!

నాక్లయింటు అయిన మాగంటి గోపాలకృష్ణ గారు వారి ఉద్యోగరీత్యా అమెరికాలో నివసిస్తున్నందున వారి తాలూకా వణుకూరు గ్రామములోని ఆస్తులకు వారి మామగారైన నర్రా లక్ష్మీనారాయణ గారు, జిపిఏ హోల్డర్‌గా వ్యవహరిస్తున్నారు. తేది 29-01-2024న సదరు ఆస్తులకు చెందిన ఒరిజినల్ దస్తావేజులను మరి ఇతర దస్తావేజులతో కలిపి రీసర్వే కొరకు ఎం.ఆర్.ఓ. ఆఫీస్ వారికి దాఖలు నిమిత్తం జిరాక్స్ కాపీలను తీయించే క్రమంలో జిరాక్స్ షాపు వద్ద బ్యాగులో పెట్టిన దస్తావేజు నెం. 4465/2003, తేది. 29-12-2003, దస్తావేజు నెం. 2004/2001, తేది. 06-06-2001గా గల రెండు ఒరిజినల్ దస్తావేజులు కనబడలేదు. సదరు దస్తావేజుల కొరకు ఇంటి నుండి జిరాక్స్ షాపుకు మధ్య వెతికినా దొరకలేదు. కావున పైన తెల్పిన దస్తావేజులు ఎవరికైననూ దొరికిన యెడల ఈ దిగువ తెల్పిన చిరునామాకు అందజేయగలరు. అదేవిధంగా పై తెల్పిన దస్తావేజులను ఆసరాగా చేసుకొని ఎవరైనను ఎట్టి అన్యాక్రాంతములు, లావాదేవీలు వగైరాలు చేసిన యెడల అట్టి వ్యవహారములు నాక్లయింటును ఏవిధంగా బైండ్ చేయజాలవని మరియు అట్టి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

కడియాల వకుళాదేవి, న్యాయవాది
ఇ.నెం.5-20, వణుకూరు,
పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా
సెల్ : 93929 22017

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు అయిన మాగంటి విజయకుమారి, భర్త గోపాలకృష్ణ, నివాసం : యుఎస్ఏ, రిప్రజెంటెడ్ బై జిపిఏ హోల్డర్ నర్రా లక్ష్మీనారాయణ, తండ్రి కుమారస్వామి, నివాసం : డో.నెం.5-144, వణుకూరు, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా వారి సంజాయిషీ పొంది ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా!

నాక్లయింటు అయిన మాగంటి విజయకుమారి గారు వారి ఉద్యోగరీత్యా అమెరికాలో నివసిస్తున్నందున వారి తాలూకా వణుకూరు గ్రామములోని ఆస్తులకు వారి తండ్రిగారైన నర్రా లక్ష్మీనారాయణ గారు, జిపిఏ హోల్డర్‌గా వ్యవహరిస్తున్నారు. తేది 29-01-2024న సదరు ఆస్తులకు చెందిన ఒరిజినల్ దస్తావేజులను మరి ఇతర దస్తావేజులతో కలిపి రీసర్వే కొరకు ఎం.ఆర్.ఓ. ఆఫీస్ వారికి దాఖలు నిమిత్తం జిరాక్స్ కాపీలను తీయించే క్రమంలో జిరాక్స్ షాపు వద్ద బ్యాగులో పెట్టిన దస్తావేజు నెం. 1489/1957, తేది. 05-08-1957, దస్తావేజు నెం. 3469/2002, తేది. 29-07-2002, దస్తావేజు నెం. 3470/2002, తేది. 29-07-2002, దస్తావేజు నెం. 2286/2009, తేది. 11-08-2009గా గల నాలుగు ఒరిజినల్ దస్తావేజులు కనబడలేదు. సదరు దస్తావేజుల కొరకు ఇంటి నుండి జిరాక్స్ షాపుకు మధ్య వెతికినా దొరకలేదు. కావున పైన తెల్పిన దస్తావేజులు ఎవరికైననూ దొరికిన యెడల ఈ దిగువ తెల్పిన చిరునామాకు అందజేయగలరు. అదేవిధంగా పై తెల్పిన దస్తావేజులను ఆసరాగా చేసుకొని ఎవరైనను ఎట్టి అన్యాక్రాంతములు, లావాదేవీలు వగైరాలు చేసిన యెడల అట్టి వ్యవహారములు నాక్లయింటును ఏవిధంగా బైండ్ చేయజాలవని మరియు అట్టి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

కడియాల వకుళాదేవి, న్యాయవాది
ఇ.నెం.5-20, వణుకూరు,
పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా
సెల్ : 93929 22017

సమ్మెను విరమించిన తర్వాత సమస్యలు పట్టవా?

విశాలాంధ్ర-విజయవాడ: మున్సిపల్ కార్మికులు సమ్మె విరమించిన తరువాత వారి సమస్యలు పట్టావా? అని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆసుల రంగనాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ చర్యలు తీసుకోకపోవటంతో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లడుతూ మున్సిపల్ కార్మికులు గత డిసెంబరు 20 తేది నుంచి సమ్మెలోకి వెళ్లిన సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులతో ప్రభుత్వం చర్చల జరిపి కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు అంగీకరించటంతో సమ్మె విరమించటం జరిగిందన్నారు. తమ డిమాండ్‌లను పరిష్కరిస్తూ సంక్రాంతికి జీవో ఇస్తామని హామి ఇచ్చిన ప్రభుత్వం ఇంతర వరకు జీవో విడుదల చేయలేదన్నారు. దాదాపు రెండు నెలలు కావస్తున్నా ప్రభుత్వం నుంచి సానుకూలంగా జీవో రాకపోవటంతో ఆందోళన చేపటట్టం జరిగిందన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం, అధికారులు పట్టించోకపోవటంతో రాజ్యాంగ నిర్మాతైన డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌కు గోడు వినిపించి వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. మున్సిపల్ రంగంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ విభాగ ఉద్యోగులు, కార్మికులు, డ్రైవర్లు, గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులు, పార్కు వర్కర్లు, స్కూల్ స్వీపర్లు, టాయిలెట్ వర్కర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరించే రకు కనీస వేతనం రూ.26వ వేలు చెల్లించాలన్నారు. 11వ పీఆర్సీ ప్రకారం 20వేల రూపాయలు వేతనం, కరువు భత్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం రూ.15వేలు వేతనం, రూ.6వేలు అలవెన్సు రూపంలో ఇస్తుందని ఆ మొత్తం రూ.21వేల రూపాయలను వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదవీవిరమణ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో కాష్ట్ర వ్యాప్త సమ్మెకు సిద్ధమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు జక్కి జేమ్స్, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు తుపాకుల నాగేశ్వరావు, వెంకటేశ్వరరావు, బ్రహ్మం, పద్మావతి, నేలమ్మ, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.11 లక్షలు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం, : ఏపీ సిపిడిసిఎల్ లో లైన్మెన్ గా పనిచేస్తూ విధులు నిర్వహిస్తున్న సమయంలో విద్యుత్ షాక్ గురై కన్నా వీరాంజనేయులు డిసెంబర్ నెలలో మరణించాడు. ఇబ్రహీంపట్నం కెనరా బ్రాంచ్ లో లోన్ ఇన్సూరెన్స్ కట్టడం వలన కెనరా హెచ్ ఎస్ బీ సి లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు మృతుని భార్య కన్నా రాజేశ్వరికి సీనియర్ మేనేజర్ జి మహేష్ కెనరా బ్యాంక్ ఇబ్రహీంపట్నం డి శ్రీనివాసరావు ఏపీ సీపీడీసీఎల్ విజయవాడ క్లస్టర్ మేనేజర్ జి ప్రసాద్ సి ఎల్ వో కిరణ్ పవన్ సమక్షంలో 11 లక్షల రూపాయల క్లెయిమ్ చెక్కును అందజేశారని తెలిపారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలో వ్యవసాయ కార్మికులు మమేకం కావాలి

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంలోని మోదీ, అమిత్ షా నియంతల నేతృత్వంలో సాగిస్తున్న నిరంకుశ పాలన అంతం కావాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 16న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలో గ్రామీణ వ్యవసాయ కూలీలు కార్మికులు పెద్ద ఎత్తున కదలి మమేకం కావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ దాసరి నాగభూషణరావు భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఉప్పె నరసింహారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల చెన్నైలో జరిగిన బీకేఎంయూ జాతీయ జనరల్ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలు, భవిష్యత్తు కర్తవ్యాలను వివరించారు. గ్రామీణ శ్రమజీవులు ఎదుర్కొంటున్న ప్రధానమైన భూ సమస్యలు, సాగుభూమి, ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం, పేదల వాడల్లో విద్య వైద్యం విద్యుత్ మంచినీళ్ల తదితర సామాజిక సౌకర్యాలు కల్పన కోసం ఉపాధి హామీ పనుల కల్పన సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు కూలి 600 రూపాయలు కూలి సాధన కోసం వ్యవసాయం పరిశ్రమలు గనులు, విద్యుత్ అడవి సంపదలి రవాణా బ్యాంకులో ఎల్ఐసీ లన్నిటిని కార్పోరేట్ కార్పొరేట్లకు కట్టబెట్టి దుర్మార్గపు పాలన విధానాలు ఎండగట్టెందుకు 16 బంద్‌లో కూలి దండు కదలాలన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లాలో వేలాది ఎకరాలను భూ పోరాటాలు నిర్వహించి పేద ప్రజలకు పంపిణీ చేసిన ఘనత సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘానికి ఉందని గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో అన్ని వర్గాల ప్రజలు విసుగు చెందారన్నారు. గ్రామీణ పేదలపై అన్ని రకాల ప్రభుత్వాలు రకరకాల పన్నులతో రకరకాల ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు చాలా ఇబ్బందుల్లో ఉన్నారని చెప్పారు. అన్నింటినీ అధికమించడానికి గ్రామీణ ప్రాంతాలలోని అన్ని వర్గాల ప్రజలను సమీకరించి 16వ తేదిన గ్రామీణ బంద్‌కు కదిలించాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలోని వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించే భూపోరాటాలు ఇల్లు ఇళ్ల స్థలాలు మొదలగు సమస్యలపై ఉద్యమాలు నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘానికి పూర్తిగా పార్టీగా అండదండగా ఉంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు ముందుగా జిల్లాలో జరిగిన కార్యకలాపాల వివరాలను కమిటీకి వివరించారు. ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యక్రమాలను కమిటీ ముందు ప్రతిపాదించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా నాయకులు తూము కృష్ణయ్య, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.పిచ్చయ్య ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ దుర్గ కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు షేక్ నాగుల్‌మీరా, పగిడి మల్లీ రవి, భూక్య దేశాయ్, వెంకటరమణ, కారుమూరి రత్నకుమారి, రావూరి తీర్పి, ఇస్లామత్ బాలాజీ, బాణావతి వెంకటేశ్వరరావు, జడవాత్ బాలాజీ నాయక్, భూక్య గోపీ. ముగ్గురాళ్ల నాగేశ్వరరావు తదితరులు అయా నియోజకవర్గంలో సమస్యలపై మాట్లాడారు.

16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : కేంద్ర, ప్రభుత్వ రైతు. కార్మిక. ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సఘాలు పిలుపులో భాగంగా 16న దేశ వ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్, ప్రారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం పెనుగంచి ప్రోలు సీపీఐ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు వలంకొండ బ్రాహ్మం. సీపీఎం నాయకులు దారనాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బ్రిటిష్ కాలం నాటి దుర్మార్గపు చట్టాలకూ మరిన్ని కోరలు తొడిగి మరింత క్రూరంగా తయారు చేసి ఆ కోరలు కనబడకుండా భారతీయత అనే ముసుగేసి జాతీయత అనే రంగులు అద్దడానికి భారత న్యాయ సంహిత అనే ముద్దుపేరుతో చట్టం చేసి అమలు చేసేందుకు పూనుకుందని విమర్శించారు. 2023 లో ఆగస్టులో పార్లమెంట్ లో ప్రవేశపెట్టి డిశంబర్ లో అమోదించటం తో అది చట్టం గా మారిందని తెలిపారు. ఈ చట్టంలో ఇంకొక్క గోరం ఏమిటంటే హిట్ అండ్ రన్ అంటే ప్రమాదం జరిగిన తరువాత గుమిగుడే జనం నుంచి తన ప్రాణ రక్షణ కోసం డ్రైవర్ పారిపోతే అలాంటి వారికి రూ..7లక్షలు జరిమానాతో పాటు 10. సంవత్సరాలు. జై లు శిక్ష విధించేందుకు చట్టంలో మార్పులు చేశారని చెప్పారు.దీనికి వ్యతిరేకం గా రైతు. కార్మిక సంఘల ఐక్య వేదిక ఆధ్వర్యంలో 16 న శుక్రవారం జరిగే గ్రామీ ణ బంద్. పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోమండల సీపీఐ కార్యదర్శి కనకపుడి. బాబురావు.కొత్తపల్లి. పుల్లయ్య. తురక. కొండలు. వెంకన్న. తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను పరిశీలించిన మేయర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర మేయర్ భాగ్యలక్ష్మి మంగళవారం జక్కంపూడిలోని టిట్కో గృహాలను పరిశీలించారు. మోడల్ హౌసెస్ ప్లానింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు త్వరలో టిట్కో గృహాలను అందుబాటులోకి తీసుకురావాలని, నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. పేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు సంపాదిస్తున్న వేతనంలో అధిక భాగం అద్దెలకు సరిరపోవటం వల్ల వాళ్ళు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి ఇబ్బందులను తొలిగించి పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కృత నిచ్చయంతో ఉన్నారని తెలిపారు. ఈ పర్యటనలో వీఎంసీ అడిషనల్ కమిషనర్ కేవీ.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ప్రజల ముంగిట్లో ప్రజారంజక పాలన: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మండలంలోని పెండ్యాల గ్రామంలో "గడపగడపకు - మన ప్రభుత్వం" కార్య క్రమంలో భాగంగా మంగళవారం ఉదయం ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల బుక్ లెట్ లను శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీల్లో 98% అమలు చేసి, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ కార్యక్రమాల అమలతో ప్రజల ముంగిట్లోనే ప్రజా రంజక పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల ఇళ్ల పట్టాలు మంజూరు చేసి దేశం లోనే చరిత్ర సృష్టించిన వైయస్ జగన్ దేశాని కే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అమ్మ ఒడి,విద్యా దీవెన,జగనన్న విద్యా కిట్లు, గోరు ముద్ద,వసతి దీవెన,నాడు- నేడు వంటి కార్యక్రమాలు ప్రభుత్వ విద్య బలోపేతానికి ఎంతో దోహదపడ్డాయ ని వివరించారు. 108, వైయస్సార్ ఆరోగ్యశ్రీ,ఫ్యామిలీ డాక్టర్ విధానం వంటి కార్యక్రమాలు పేదలకు నాణ్య మైన వైద్యాన్ని దరిచేర్చిందని చెప్పారు. విద్య,వైద్య రంగాల్లో ప్రపంచం లోనే గొప్ప కార్యక్రమాలు మన ప్రభుత్వంలో జరుగు తున్నాయని తెలిపారు. ఎన్నికలు ఏడాది లోగానే ఉన్నాయని, జాతీయ స్థాయి సంస్థలు ఇటీవల నిర్వహించిన సర్వేల్లో వైయస్సార్సీపీ మరోసారి విజయకేతనం ఎగుర వేయనున్నదని తెలిపోయిందని వెల్లడించారు. జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ సుపరిపాలనకు ప్రజలు మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారు లు,వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల నియామకాలకు చర్యలు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : విభిన్న ప్రతిభావంతులకు నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, అర్జీల పరిష్కారానికి ప్రత్యేకంగా ఏర్పడిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ నియామకాలు, సదరం సర్టిఫికెట్లు జారీ, అర్హులైన వారు ఓటు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. హోం ఓటింగ్ సదుపాయం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. విభిన్న ప్రతిభావంతుల హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నోటిపై చేసిన రూల్స్ ప్రకారం జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ప్రణాళిక ప్రకారం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ రూపొందించి దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారికి సదరం సర్టిఫికెట్స్ జారీ చేయటం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధికారి కామరాజు, డీఎంహెచ్‌వో డా.సుహాసిని, డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగరంలో గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్ రోడ్ షో ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్, ఎబ్లు శ్రేణి ఎలక్ట్రిక్ 2, 3 వీలర్ల తయారీదారులు విజయవాడలోని తమ డీలర్‌షిప్‌ను విస్తరిస్తూ తమ పాన్ ఇండియా రోడ్‌షోను కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. నగరంలోని డీలర్‌షిప్ బిఎస్ ఈ స్కూటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్ యొక్క అత్యాధునిక ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శించడానికి రోడ్‌షో సెట్ చేయబడిందని గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్ ప్రతినిధి హైదర్ ఖాన్ వెల్లడించారు. రోడ్‌షో మంగళవారం నుండి 15 ఫిబ్రవరి వరకు విజయవాడలోని పంట కాలవ రోడ్డు వైపు జవహర్ ఆటోనగర్‌లోని బీఎస్‌సీ స్కూటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డీలర్‌షిప్‌లో జరుగుతుందన్నారు. ఎలక్ట్రిక్ కార్ల పరిశ్రమలో తాము సాధించిన పురోగతిని ప్రత్యక్షంగా చూసేందుకు చలనశీలత భవిష్యత్తును అనుభవించడానికి రోడ్‌షోలో తమతో చేరాలని, ఈ రోడ్‌షో వీల్స్ బ్యాటరీలను మాత్రమే కాకుండా విస్తరించి ఉన్న స్థిరమైన పురోగతి సంభావ్యతను విశ్వసించే కమ్యూనిటీని ప్రోత్సహిస్తుందని చెప్పారు.

విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా జగ్గయ్యపేటలోని విశ్వ భారతి డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం.వి. ఐ, ఎం.వి.రవికుమార్ మాట్లాడుతూ..ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ప్రతి ఒక్కరికి లైసెన్స్ తప్పనిసరి అని అదేవిధంగా ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఆర్. సి ఫోర్స్ లో ఉండాలని కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, యువత వాహనాన్ని నడిపేటప్పుడు మితిమీరిన వేగంతో వెళ్లకూడదని కచ్చితంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.... ఈ కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు రంగాపురం నరసింహారావు, పెనుగొండ. వెంకట రాజీవ్, కొల్లా.నాగరమేష్ , జిల్లా. తిరుపతిరావు, జూటూరి. వెంకటేశ్వర్లు(అబ్బులు) వి.వి.ఎల్. నారాయణ రావు మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యమబాట

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన బకాయిలను సత్వరమే చెల్లించాలని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని గత నాలుగేళ్లుగా ప్రభుత్వానికి వివిధ రూపాల్లో విజ్ఞప్తి చేశాం. కానీ సమావేశం అయిన ప్రతీసారీ వాయిదాలే తప్ప పురోగతి లేదు. ఇకనుంచి మా ఉద్యోగ వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేసేందుకే సిద్ధమయ్యామని జిల్లా ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లోని ఏపి ఎన్జీవో భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వల్ల ఉద్యోగులు ఎదుర్కొం టున్న సమస్యలను వివరించారు. ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం మా పోరాటం కొనసాగుతుందన్నారు. గతంలో ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ యధావిధిగా కొనసాగుతుందన్నారు. నేటి నుండి నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామన్నారు. తహసిల్దారు, సబ్ కలెక్టర్, కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పణ, 15, 16 తేదీల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి మధ్యాహ్నం భోజన విరామ సమయంలో తాలూకా కేంద్రాలు, పాఠశాలల్లో నిరసన కార్యక్రమాలు, 17వ తేదీన తాలూకా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నా చేపట్టడం, 20వ తేదీన జిల్లా కలెక్టరేట్ల వద్ద ర్యాలీ, ధర్నా నిర్వహణ, 21 నుంచి 24 వరకు రాష్ట్ర నాయకులు అన్ని జిల్లాల్లో పర్యటించి 27వ తేదీన చేపట్టనున్న "చలో విజయవాడ"కు ఉద్యోగులను సిద్ధం చేస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా జేఏసీ కన్వీనర్ ఎండి ఇక్బాల్, ఉపాధ్యాయ సంఘాల నుంచి యు టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసరావు, ఎ పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఖాసిం, ఎన్టీఆర్ జిల్లా ఎస్టియు అధ్యక్షులు ఎస్.కె ఇమ్రాన్ సాహెబ్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దాలి నాయుడు, విష్ణువర్ధన్ పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎ. సాంబశివరావు, ఐటిఐ ఉద్యోగుల అసోసియేషన్ ఉపాధ్యక్షులు కిషోర్ బాబు, గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు శశిధర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. సతీష్ కుమార్.వైస్ ప్రెసిడెంట్ బి వి రమణ .విజయవాడ నగర శాఖ కార్యదర్శి సంపత్ కుమార్ మధుసూదనరావు మహిళా కార్యదర్శి కె .శివ లీల,పాల్గొన్నారు.

టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు : ఎంపీ కేశినేని

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: తెలుగుదేశం పార్టీకి రానున్న ఎన్నికలు చివరి ఎన్నికలని విజయ వాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. విస్సన్నపేట ఏఎంసీ గోడౌన్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. మానవ అభివృద్ధి ద్వారా దేశాభివృద్ధి సాధ్యమని నమ్మే వ్యక్తి జగన్ అన్నారు. ప్రజలంతా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో నాడు-నేడు, విలేజ్ క్లినిక్, సచివాలయ వ్యవస్థల ద్వారా పేదవర్గాలకు నాణ్యమైన వైద్యం, విద్య, ప్రభుత్వ సేవలను అందు బాటులోకి తెస్తున్నట్లు వివరించారు. జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం కారణంగా ప్రజలు 175 స్థానాల్లో వైసీపీని గెలిపించనున్నారన్నారు. తిరువూరు నాయకుడు స్వామిదాస్ 30 ఏళ్లకు పైగా, తాను పదేళ్లకు పైగా టీడీపీలో ఉన్నామని, టీడీపీ పేద వర్గాలకు దూరమై, పెత్తందారుల ప్రయోజనాలే లక్ష్యంగా కొనసాగుతోందని విమర్శించారు. చంద్రబాబు, ఆయన కొడుకు ఎంత ప్రయత్నించినా రానున్న ఎన్నికల్లో ఓడిపోయి, తన నివాస రాష్ట్రమైన తెలంగాణాకు మకాం మార్చవలసిందేనన్నారు. మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆసరా జంబో చెక్కును ఆవిష్కరించారు. అంతకుముందు కొండపర్వలో నూతనంగా నిర్మించిన విలేజ్‌క్లినిక్, రైతుభరోసా కేంద్రాలను, విస్సన్నపేటలో నాడు-నేడు పథకం ద్వారా రూ.5 కోట్లతో అభివృద్ధి చేసిన ఆసుపత్రి నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. స్థానిక మండలపరిషత్తు కార్యాలయంలో మండలంలోని తాతకుంట్ల, నరసాపురం, పుట్రేల, చంద్రుపట్ల తండా, కొండపర్వ పంచాయతీలకు తన నిధుల ద్వారా సమకూర్చిన తాగునీటి ట్యాంకర్లను పంపిణీ చేశారు. అనంతరం టీడీపీ నేత నెక్కళపు శ్రీనివాసరావు(సూపర్‌బజారు)ను ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. విస్సన్నపేట మాజీ సర్పంచి పల్లిపాం లక్ష్మయ్య తన అనుచరులతో ఎంపీ నాని ఆధ్వర్యంలో వైసీపీలో చేరారు. కార్యక్రమంలో తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, తిరువూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, విస్సన్నపేటకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, మండలంలోని అధికారులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో అక్రమ మద్యం స్వాధీనం

విశాలాంధ్ర-పమిడిముక్కల: కపిలేశ్వరపురం లో అక్రమం గా మద్యం విక్రయాలపై సమాచారం రావటంతో దాడి చేసి మద్యాన్ని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కపిలేశ్వరపురం గ్రామంలో అక్రమం గా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుండి తొమ్మిది మద్యం సీసాలను,రూ. 1350ల ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర-విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసిపి టిడిపి జనసేన బిజెపి కాంగ్రెస్ పలు ప్రధాన పార్టీలు మాదిగలకు 18 అసెంబ్లీ సీట్లు రెండు పార్లమెంట్ స్థానాలు కేటాయించి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టి ఎమ్ రమేష్ మాదిగ డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణపట్నం లెదర్ ఇండస్ట్రియల్ ని ప్రభుత్వం పున ప్రారంభించి 20 లక్షల కోట్లు బడ్జెట్ కేటాయించి మాదిగ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మండల నియోజకవర్గ జిల్లా కేంద్రాల్లో లెదర్ పార్కు ఏర్పాటు చేసి చర్మకార బాధితులకు ఉపాధి కల్పించాలని కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): జాతీయ రోడ్డు భద్రత పురస్కరించుమని పోస్టర్ ను ఆవిష్కరించిన డిసిపి కడియం చక్రవర్తి. ఎన్నారై విద్యాసంస్థలు, టెక్ మహీంద్రా దేశం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం డిసిపి చక్రవర్తి వాహనదారులను ఆపి రోడ్డు భద్రతపై, ట్రాఫిక్ నిబంధనలను అవగాహన కల్పించారు. వాహనం నడుపుతూ సెల్ ఫోన్ మాట్లాడకూడదని, హెల్మెట్ ధరించాలని, కారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, నినాదాలతో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి, సురేంద్రబాబు కాలేజీ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

16న గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె ఫిబ్రవరి 16వ తేదీన జయప్రదం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె.ఉమర్‌వలీ మంగళవారం తెలిపారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక, కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన జరగనున్న గ్రామీణ భారత్బంద్ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులందరూ పనులు నిలుపుదల చేసి పాల్గొనాలని కోరారు. 44 కార్మిక చట్టాలను కేంద్రప్రభుత్వం 4కోడ్లుగా విభజించి కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ నగర సహాయ కార్యదర్శులు సి.హెచ్.వి.రమణ, ఆర్. ప్రభుదాస్ పాల్గొని బంద్ను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

బంద్, పారిశ్రామిక సమ్మెలో మమేకం కావాలి

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల సంఘం, ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య పలుపునిచ్చారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక చీరాల సెంటర్‌లో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. వ్యవసాయం పరిశ్రమలు గనులు విద్యుత్తు అటవీ సంపద రవాణా బ్యాంకులు, ఎల్ఐసీ తదితర సంస్థలన్నింటినీ ఆదాని అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని చూస్తుందన్నారు. ఏఐటీయూసీ తిరువూరు నియోజకవర్గ అధ్యక్షులు ఎస్.కె మీరా కార్పెంటర్, కార్యదర్శి మాలపాటి ఉదయ్, తిరువూరు ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్కే హసన్‌లు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదని, వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయలేదని రైల్వే జోన్‌కు ఎగనామం పెట్టిందని కడప ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వకపోగా తెలుగు ప్రజల సాధించుకున్న విశాఖ ఒక ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. నేపథ్యంలో ఫిబ్రవరి 16వ తేదీన జరిగే గ్రామీణ బంద్‌లో ఏఐటీయూసీ బిల్డింగ్ వర్కర్లు, ఆటో వర్కర్ యూనియన్ సభ్యులు, లారీ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కే సుభాని, సీపీఐ సీనియర్ నాయకులు అయినాల ముత్తయ్య, బాణాల అశోక్, పల్లపు మురళి, మదాసు ప్రసాద్, సత్యం, నరసింహారావు, శివ, పాలకుర్తి సునీల్, తోట పిచ్చయ్య, పైడిపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SHAIK AMEER HUSSAIN (Old Name), S/o. Shaik Shali, R/o. D.No. 15-215, Pedda Masjid Street, Sanath Nagar, Kanuru, Vijayawada-520007,NTRDist.,A.P. I, declare that I, have changed my name as **MOHAMMAD RIYAZ** (New Name). Hereafter my name is known and called as **MOHAMMAD RIYAZ.**

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR: AT GUNTUR
Dispute No. 05 / 2023

Between:
M/s.AUDIRAM CHIT FUNDS PVT. LTD., Guntur, rep. by its Foreman ....Disputant
and
Mannam Srinivasa Rao & Others ...Opponents
Opp.-2: Mr.Odugu Anka Raju, S/o. Sundaiah, R/o. D.No.17-141 Ferry, Ibrahimpatnam, Krishna District.

Please take notice that the above dispute is filed against Opp.2 of you and others for recovery of rates **Rs.2,17,727/-**(Rs.Two Lakhs Seventeen Thousand Seven Hundred Twenty seven Only) and the same is posted on **20-02-2024** for the appearance of you before the Hon'ble Deputy Registrar of Chits, Guntur at **10.30 A.M.** Either in person or through an Advocate. If you fail on that day the matter will be herard and decided exparty basis on the material available.
(By order of the Deputy Registrar of Chits).

M/s. Audiram Chit Funds Pvt. Ltd., Guntur.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR: AT GUNTUR
Dispute No. 24 / 2023

Between:
M/s.AUDIRAM CHIT FUNDS PVT. LTD., Guntur, rep. by its Foreman ....Disputant
and
Bandi Venkata Krishna Reddy & Others. ....Opponents
Opp.-3: Mr.Chatragadda Sudhakar, S/o. Babu Rao Residing at D.No.36-9/1-8/3, Nehru Nagar, Mogalraj Puram, Vijayawada, Krishna Dt.
Opp.-5: Mr. Sk.Karimulla, S/o.Hameed ,Residing at D.No.26-20-37/A,11th Lane, A.T.Agraharam, Guntur, Guntur Dt.

Please take notice that the above dispute is filed against Opp.-3 and Opp.-5 of you and others for recovery of rates Rs.3,24,755/-(Rs.Three Lakhs Twenty Four Thousand Seven Hundred Fifty five Only) and the same is posted on **20-02-2024** for the appearance of you before the Hon'ble Deputy Registrar of Chits, Guntur at **10.30 A.M.** Either in person or through an Advocate. If you fail on that day the matter will be herard and dicided exparty basis on the material available.
(By order of the Deputy Registrar of Chits).

M/s. Audiram Chit Funds Pvt. Ltd., Guntur.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR: AT GUNTUR
Dispute No. 08 / 2023

Between:
M/s.AUDIRAM CHIT FUNDS PVT. LTD., Guntur, rep. by its Foreman ....Disputant
and
Yarrabothula Naga Sankara Reddy & Others ....Opponents
Opp.-2: Mr.Yarrabothula Naga Srinivasa Reddy S/o. Krishna Reddy, R/o. 3rd Floor, Pitchireddy Apartments, Indian Bank Backside, Nunna, Krishna District.
Opp.-5: Mrs. Yarrabothula Padma, W/o.Naga Srinivasa Reddy, R/o.3rd Floor, Pitchireddy Apartments, Indian Bank Backside, Nunna, Krishna District.

Please take notice that the above dispute is filed against Opp.-2 and Opp.-5 of you and others for recovery of rates **Rs.5,39,014/-**(Rs.Five Lakhs Thirty Nine Thousand Fourteen Only) and the same is posted on **20-02-2024** for the appearance of you before the Hon'ble Deputy Registrar of Chits, Guntur at **10.30 A.M.** Either in person or through an Advocate. If you fail on that day the matter will be herard and dicided exparty basis on the material available.
(By order of the Deputy Registrar of Chits).

M/s. Audiram Chit Funds Pvt. Ltd., Guntur.

కరవడి-సూరారెడ్డిపాలెం స్టేషన్ల మధ్య అందుబాటులోకి విద్యుదీకరణ, మూడో లైన్

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ - గూడూరు ట్రిప్లింగ్ విద్యుదీకరణలో భాగంగా బాపట్ల - సూరారెడ్డిపాలెం మధ్య 81 కిలోమీటర్ల మేర మూడవ లైన్ సౌకర్యంతో పాటు విద్యుద్దీకరణ పూర్తి చేశారు.ఎస్సీ రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాముఖ్యతనిస్తూ డబ్లింగ్-ట్రిప్లింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించింది.దానిలో భాగంగా కరవడి - సూరారెడ్డిపాలెం మధ్య 20.3 కి.మీ.ల పనులు పూర్తి చేసి ప్రారంభించారు.మన రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రధాన ప్రాజెక్టులలో ఒకటి అయిన విజయవాడ-గూడూరు ట్రిప్లింగ్-విద్యుదీకరణ.ప్రకాశం జిల్లా పరిధిలోకి వచ్చే బాపట్ల - సూరారెడ్డిపాలెం మధ్య 81కిలోమీటర్ల విద్యుదీకరణతో పాటు మూడో లైన్ అందుబాటులోకి వచ్చింది.విజయవాడ-గూడూరు మధ్య గ్రాండ్ ట్రంక్ మార్గంలో ఈ సెక్షన్ దేశంలోని ఉత్తర-తూర్పు ప్రాంతాలను దక్షిణాది రాష్ట్రాలతో అనుసంధానించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్యాసింజర్ సరకు రవాణా రైళ్లలో స్థిరమైన పెరుగుదలతో ఈ మార్గం అత్యంత రద్దీగా ఉంటుంది.ఈ కీలకమైన సెక్షన్‌లో రద్దీని తగ్గించేందుకు, విజయవాడ - గూడూరు మూడవ లైన్ ప్రాజెక్ట్ 2015-16 సంవత్సరంలో 288 కి.మీల దూరానికి సుమారు రూ.3,246 కోట్లతో మంజూరు చేసి ప్రాజెక్ట్ పనులను రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌కు అప్పగించారు.ఇప్పటివరకు గూడూరు- సింగరాయకొండ మధ్య 127కిలోమీటర్ల ,బాపట్ల-కరవడి మధ్య 62కి.మీ.ల మేర పనులు పూర్తి చేసి ప్రారంభించారు. ప్రస్తుతం విజయవాడ - గూడూరు మధ్యలో ఉన్న కరవడి- ఒంగోలు - సూరారెడ్డిపాలెం మధ్య 20 కి.మీల మేర సెక్షన్ పూర్తితో మొత్తం 209 కి.మీ.లు మూడో లైన్‌తో పాటు విద్యుద్దీకరణ పూర్తి అయినట్లు అవుతుంది.ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ కరవడి- సూరారెడ్డిపాలెం సెక్షన్ మధ్య ట్రిప్లింగ్, విద్యుదీకరణ పనులను పూర్తి చేసిన విజయవాడ డివిజన్‌లోని బృందాన్ని, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ అధికారులను అభినందించారు. విజయవాడ-గూడూరు మధ్య మూడో లైన్ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపడుతున్నామని,అన్ని విభాగాలలో ఏకకాలంలో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత, రద్దీగా ఉండే ఈ మార్గంలో రద్దీని తగ్గిస్తుంది, రైలు కార్యకలాపాల సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుందన్నారు.

జె ఈ ఈ మెయిన్స్‌లో శ్రీనివాస గ్రావిటీ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్ : జె ఈ ఈ మెయిన్స్ 2024మొదటి సెషన్ ఫలితాలలో నగరంలోని శ్రీ శ్రీనివాస గ్రావిటీ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కళాశాల చైర్మన్ పరుచూరి శ్రీనివాస్ తెలిపారు. మొగల్ రాజ పురంలోని కళాశాల కాన్ఫరెన్స్ హాల్ నందు మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థి అన్నే భరత్ 99.7, శివరామ కృష్ణ99.3, కె.నూతన శ్రీ 97.5 అత్యధిక పర్సంటైల్ సాధించారని తెలిపారు.అలాగే 20 మందికి పైగా 90 పర్సంటైల్ సాధించారని తెలిపారు. ప్రతి ఏటా జె ఈ ఈ మెయిన్స్ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని తెలిపారు. పూర్తి స్థాయి అనుభవం కల అధ్యాపకుల కృషి వల్లనే మంచి ఫలితాలు సదిస్తున్నమని తెలిపారు.అలాగే తల్లిదండ్రుల సహకారం కూడా వుందని అన్నారు. ఈ సమావేశంలో కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ సతీష్, ఫిజిక్స్ లెక్చరర్ సురేష్ బాబు, ప్రిన్సిపాల్ పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణావర్శిటీ హ్యాండ్‌బాల్ ఛాంపియన్ కేబీఎన్

రెండు, మూడు స్థానాల్లో డీఆర్ కళాశాల, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ (పురుషుల) ఛాంపియన్‌గా కేబీఎన్ కళాశాల విజయం సాధించింది. కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ (పురుషుల) కేబీఎన్ కళాశాల క్రీడా విభాగం ఆధ్వర్యంలో ఆ కళాశాల ఆవరణలో రెండు రోజులుగా జరిగాయి. మంగళవారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. నూజివీడు డీఏఆర్ కళాశాల ద్వితీయ స్థానంలో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల తృతీయ స్థానంలో నిలిచాయి. ఉదయం నుంచి జరిగిన క్రీడా పోటీలు ఆద్యంతో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులను తోటి విద్యార్థులు తమ కరతాళధ్వనులతో అభినందించారు.

క్రమశిక్షణతోనే రాణింపు

క్రీడాకారులు క్రమశిక్షణతో సాగినప్పుడు మరింత రాణించి మంచి విజయాలను అందుకుంటారని ఏసీపీ అశోక్‌కుమార్‌గౌడ్ అన్నారు. టోర్నమెంట్ ముగింపు సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి అశోక్‌కుమార్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో భాగస్వాములు కావాలన్నారు. తద్వారా మంచి ఆరోగ్యంతో పాటుగా అనేక అవకాశాలను పొందుతారని వివరించారు. తాను కేబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థిగా క్రీడల్లో రాణించి అనేక బహుమతులను పొందినట్లు వివరించారు. విశ్వవిద్యాలయం క్రీడా విభాగాధిపతి డాక్టర్ జేఎస్ లావణ్యలత మాట్లాడుతూ విశ్వవిద్యాలయం క్రీడలను ప్రోత్సాహిస్తుందన్నారు. క్రీడారంగంలో విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల విద్యార్థులు జాతీయ స్థాయిలో అనేక బహుమతులను సాధిస్తున్నారని వివరించారు. కార్యక్రమాన్ని కళాశాల క్రీడా విభాగాధిపతి డీ హేమచంద్రరావు నిర్వహించారు.వివిధ కళాశాలలకు చెందిన క్రీడా విభాగ అధ్యాపకులు మన్నే స్వామి, బాయన రాములు తదితరులు పాల్గొన్నారు.

పెనుమత్సలో పడకేసిన పశువైద్యం

విశాలాంధ్ర-పమిడిముక్కల : దేశానికి వెన్నెముక రైతేనని.. దేశానికి పల్లెలే పట్టు కొమ్మలని ఊదర కొట్టే రాజకీయ నాయకులు పల్లెల్లో పశువైద్యం గురించి కొన్ని సంవత్సరాల గా పట్టించుకునే నాథుడు లేక పశువైద్యం పడకేసిందని పలువురు పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పెనుమత్స గ్రామంలో పశువైద్య శాల భవనం శిధిలావస్థలో వుందని పశువైద్యులు లేక సకాలంలో వైద్యం అందక పోవడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ వైద్యం అందక ప్రైవేటు వైద్యులు ఖర్చులు భరించలేక అవస్థలు పడుతున్నామని, స్థానికంగా పశు వైద్యశాల ఉన్నా ఏడాది నుంచి వైద్యుడు లేరని, ఇక్కడ పనిచేసే డాక్టర్ ని డిప్యూటేషన్ పై మరొక చోటుకు వెళ్ళారు.గ్రామానికి చుట్టు పక్కల గ్రామాలైన చోరగుడి, గోపాలకృష్ణాపురం, అలినఖీపాలెం ల పశువులు వైద్య నిమిత్తం ఇక్కడకే వచ్చేవని ప్రస్తుతం మూడు కిలోమీటర్ల కృష్ణాపురం వైద్యశాల కు వెళ్ళాల్సివస్తోందని దీనికి మరొక మనిషి అవసరమని ఇది వ్యయప్రయాసల తో కూడిన పనని రైతులు అంటున్నారు.ఈ బాధలు పడలేక పాడిగేదెల్ని అమ్మేశామని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం శూన్యమని సుబ్బారావు తెలిపారు.దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలోని పశువైద్యులు లేనిచోట వెంటనే వైద్యులను నియమించాలని కోరుతున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

విశాలాంధ్ర-అవనిగడ్డ : భారతీయ స్టేట్ బ్యాంక్ ఆద్వర్యంలో మచిలీపట్నం రిజనల్ మేనేజర్ నాబార్డ్ వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజమహేంద్రవరం కళాజాత వీధి నాటకం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మండల పరిధిలోని పులిగడ్డ పాతకోటలో భారతీయ స్టేట్ బ్యాంక్స్ స్కీమ్స్‌పై ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన పథకం, ప్రధానమంత్రి సురక్ష, అటల్ ఫించన్ యోచన పథకం, జనరల్ ఇన్సూరెన్స్ మరియు బ్యాంకులలో ఫిక్స్‌డిపాజిట్లు, రికరింక్ డిపాజిట్లు, హౌసింగ్ లోన్లు, గోల్డ్ , ముద్ర లోన్లు , రైతులకు పంట ఋణాలు, డ్వాక్రా ఋణాలు, వెహికల్స్ లోన్, స్వయం సిద్ధ లోన్స్, సైబర్ క్రైమ్స్ అనగా సైబర్ నేరగాళ్ళ పట్ల అప్రమత్తంగా ఏ విధంగా ఉండాలి పలు విషయాలపై అవగాహన కల్గించారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి చెప్పకూడదని ప్రతి ఒక్కరూ ఎటిఎం కార్డు మరియు ప్రత్యేక యాప్ వాడాలని దీని ద్వారా నగదును పంపించుకోనుట, ఖాతాలో నిల్వను కూడా చూసుకోవచ్చని అవగాహన కల్గించారు. కళాకారులు విభూతి శివశంకర్, యడవల్లి కాళహస్తిలు అవగాహన కల్గించారు. ఈ కార్యక్రమానికి బ్రాంచ్ మేనేజర్ శివకృష్ణ, గ్రామ సర్పంచ్ ఫీల్డ్ అధికారి, గ్రామ పెద్దలు, రైతులు, డ్వాక్రా మహిళలు తదితరలు పాల్గోన్నారు.

నేడు రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-గన్నవరం : ఈ నెల 15 తేదీన గన్నవరం రిటైడ్ ఉద్యోగుల భవనం నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అవుటపల్లి మోహనరావు తెలిపారు. గురువారం ఉదయం10.30 నుండి మధ్యాహ్నం1 వరకు నిర్వహిస్టమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ వైద్యులు మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు కృష్ణ సాయి దంతవైద్యశాల డాక్టర్స్ పరిక్షలు.టెస్టులు నిర్వహిస్తారు. గన్నవరం సబ్ ట్రెజరీ.రిటర్డ్ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

16వ గ్రామీణ బంద్- పారిశ్రామిక సమ్మెకు మధ్యతరగతి ఉద్యోగుల మద్ధతు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను వహించాలని ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరుగుతున్న గ్రామీణ బంద్ కు పారిశ్రామిక సమ్మెకు మధ్యతరగతి ఉద్యోగులు వేదిక తమ సంపూర్ణ మద్దతును తెలియజేసింది ఆ రోజున జరిగే ఆందోళనలలో తాము కూడా పాలుపంచుకుంటామని ప్రకటించింది.గాంధీనగర్ ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ హోమ్‌లో మంగళవారం సాయంత్రం మధ్యతరగతి ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వలన దేశం పైన ప్రజల పైన భారాలు పెరిగాయని చెప్పారు రైతులకు వ్యతిరేకంగా తెచ్చిన నల్ల చట్టాలు రద్దు చేసినా వారికి ఇచ్చిన హామీలను ఇప్పటిదాకా అమలు చేయలేదని వివరించారు కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన లేబర్ కోడ్ ల అమలు కు రాష్ట్ర ప్రభుత్వాలను వత్తిడి చేస్తున్నాయని తెలిపారుప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ వేగవంతం చేయడమే కాకుండా లీజ్ కు ఇచ్చే విధానాన్ని కూడా తెచ్చారన్నారు. నిత్యాసర వస్తువుల ధరలు ఈ కాలంలో విపరీతంగా పెరిగాయన్నారు.ప్రజావసరాలకు అవసరమైన రంగాలలో కేటాయింపులు తగ్గించడం దీనికి ప్రధాన కారణమన్నారు. కార్పొరేట్లకు రాయితీలు విపరీతంగా పెంచారని చెప్పారు ఆకలి సూచిలో ప్రపంచ దేశాలలో మన దేశ స్థానం దిగజారిందని తెలిపారు ఉపాధి అవకాశాలు కుదించుకుని పోయి నిరుద్యోగం పెరిగిందని చెప్పారు ప్రజాతంత్ర హక్కుల పై దాడులు రాష్ట్రాల హక్కులు హరించడం ఈ కాలంలో జరిగాయని వివరించారు భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని చెప్పారుప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిని దేశ ద్రోహులుగా చిత్రీకరించటం వారిపైన వేధింపులు చేయడం జరుగుతున్నది అన్నారు ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసే మతం కులం లాంటి విభజన భావనలతో ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని తెలిపారు ఆర్థిక విధానాల పట్ల ప్రజల నుండి వచ్చే వ్యతిరేకతను పక్కదోవ పట్టించడానికి ఈ ప్రయత్నం చేస్తున్నారని వివరించారుదేశ రక్షణ కోసం ప్రజా సంక్షేమం కోసం ఈ విధానాల్లో మార్పు రావాలని డిమాండ్ చేశారు అందుకే 500 కు పైగా రైతు సంఘాలు 500 వరకు ఉద్యోగ కార్మిక ప్రజాసంఘాలు 16వ తేదీన ఆందోళనలో పాల్గొంటున్నయన్నారు.ప్రజానీకం ఈ బంద్‌కు తమ మద్దతు ప్రకటించాలని కోరారు.రాష్ట్ర కన్వీనర్ ఆర్ అజయ్ కుమార్ సమన్వయం చేశారు.ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. అజయ్ కుమార్, ఎపి ఎన్జీవో అసోసియేషన్ పశ్చిమ కృష్ణా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్,బి ఎస్ ఎన్ ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎల్ బాలాజీ,ఎల్ ఐ సి ఉద్యోగ సంఘం నాయకులు సి హెచ్ కళాధర్ ,బ్యాంకు ఉద్యోగ సంఘం నాయకులు ఎస్ వి రమణ , సిఐటియు జిల్లా నాయకులు ఎన్ సి హెచ్ శ్రీనివాస్, ఎం.వి. సుధాకర్, ఆర్టీసీ ఉద్యోగ సంఘం నాయకులు ఎస్ కె జిలాని, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎల్. రాజు , ఆల్ పెన్షనర్స్ నాయకులు టి ప్రభుదాస్, రైల్వే పెన్షనర్స్ నాయకులు సుందరరామ రాజు, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి ఎం.వి. ఆంజనేయులు, బి ఎస్ ఎన్ ఎల్ పెన్షనర్స్ నాయకులు చంద్రశేఖర్, అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు టి. గజలక్ష్మి పాల్గొన్నారు. 16 వ తేదీ అన్ని రంగాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని, నగర వ్యాప్తంగా పాత బస్టాండ్ నుండి జరిగే కార్మిక కర్షక ప్రదర్శన లో పాల్గొనాలని, కేంద్ర ప్రభుత్వ విధానాల దుష్ప్రభావాలు ప్రజలలో ప్రచారం చేసి మద్దతు కోరాలని తీర్మానించారు.

గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కు ఇసుజు కంపెనీ బహుకరణ

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండల కేంద్రమైన గుడ్లవల్లేరు స్థానిక ఎఎఎన్ఎమ్ అండ్ వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలకు జపాన్ కి చెందిన బహుళ జాతీయ ఇంజన్ తయారీ సంస్థ ఇసుజు 93 వేల రూపాయల ఫోర్ స్ట్రోక్ కట్ సెక్షన్ ను బహుకరించారు. పాలిటెక్నిక్ మెకానికల్ విభాగం యొక్క ల్యాబ్ నిర్వహణ కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఇసుజు (%×ాళ్ళఖ%) కంపెనీ ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్ స్వయంగా పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్య సభ్యులు, ప్రిన్సిపల్, మెకానికల్ హెచ్.ఓ.డి, మరియు స్టూడెంట్స్ కు స్వయంగా అందించడం జరిగింది. కార్యక్రమంలో ఇసుజు ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మూడు విషయాలను తప్పనిసరిగా అనుసరించాలని మొదటిది విద్యార్థులు ఒక లక్ష్యం కోసం చదువు కోవాలని ఏ పరిస్థితుల్లోనూ లక్ష్యాన్ని విడవరాదని, రెండు ఏ విషయానికి విచారించరాదని, ఎప్పుడు నూతన ఉత్తేజంతో ప్రయత్నిస్తూనే ఉండాలని, మూడు శారీరకంగా మానసికంగా ప్రతి విద్యార్థి తనను తాను కొత్తగా నిర్మించుకోవాలని అభిలాషించారు. కార్యక్రమాన్ని చాలా శ్రద్ధ ఆసక్తితో నిర్వహించిన యాజమాన్య సభ్యులను, అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో ఇసుజు ఇంటర్నల్ కంట్రోలర్ మేనేజర్ సివిల్ కుమార్ శుక్ల, టెక్నో అఫైర్స్ పబ్లిక్ రిలేషన్ మేనేజర్ పి. మురళి, డిప్యూటీ మేనేజర్ హెచ్. ఆర్.ఎస్ నరేష్, యాజమాన్య సభ్యులు చైర్మన్ డాక్టర్ నాగేశ్వరావు వల్లూరిపల్లి, కార్యదర్శి మరియు కరస్పాండెంట్ సత్యనారాయణరావు వల్లూరుపల్లి, సహకార్యదర్శి వల్లూరిపల్లి రామకృష్ణ, గవర్నింగ్ బాడీ మెంబెర్ వల్లూరిపల్లి వెంకట కిరణ్, ఎగ్జిక్యూటివ్ మెంటార్ రామాంజ నేయులు, ప్రిన్సిపాల్ ఎన్. రాజశేఖర్, డెవలప్మెంట్ కోఆర్డినేటర్ జివివి.సత్యనారాయణ, మెకానికల్ డిపార్ట్మెంట్ హెడ్ బి.ప్రవీణ, అధ్యాపక బృందం, మెకానికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-మోపిదేవి : రాష్ట్రంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం గా విరాజిల్లు తున్న మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవం పురస్కరించుకొని తొలిరోజు స్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో, ఆలయ సూపర్డెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారికి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చక స్వాములు, వేదపారాయణ దారులు, ఆలయ సిబ్బంది, భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్లో ఆకాష్ బైజూస్ విద్యార్థి రిషి శేఖర్ శుక్లాకు 100 పర్సంటైల్

విశాలాంధ్ర-విజయవాడ వన్ టౌన్ : జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ మెయిన్ 2024 మొదటి సెషన్లో ఖచ్చితమైన 100 పర్సంటైల్ సాధించిన తెలుగు రాష్ట్రలకు చెందిన రిషి శేఖర్ శుక్లా అనే శ్రద్ధగల విద్యార్థి సాధించిన అద్భుతమైన విజయాన్ని ప్రకటించినందుకు ఆకాష్ బైజూస్ గర్విస్తోంది. ఈ సాఫల్యం అతన్ని తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక స్కోరర్ గా నిలబెట్టడమే కాకుండా భారతదేశంలోని పోటీ పరీక్షలలో ఒకటైన అతని అచంచలమైన నిబద్ధత, విద్యా నైపుణ్యాన్ని కూడా నొక్కి చెబుతుంది. రిషి శేఖర్ శుక్లా అసాధారణమైన ఫీట్ తో పాటు, విజయవాడలోని ఆకాష్ బైజూస్ కు చెందిన విద్యార్థులు కె నవీన్ చౌదరి -99.40, తన్మయిశ్రీ సత్య గణేష్ -98.71, కృష్ణ పూజిత -98.69, శశాంక్ మణికంఠ -98.24 పర్సంటైల్ తో ఫలితాలును సాధించారు. ఈ విద్యార్థులను విజయవాడ ఆకాష్ బైజూస్ బ్రాంచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.వీఎస్ నరేష్, ఏరియా సేల్స్ హెడ్ రవికిరణ్, ఏరియా ఆపరేషన్ హెడ్ అర్జున్ మెమెంటోలతో అభినందించారు.

ఇండియన్ ఆయిల్ నయీ దిశ స్మైల్ ఫర్ జువెనైల్ ప్రారంభం

విశాలాంధ్ర - విజయవాడ వన్ టౌన్ : అగ్రశ్రేణి అంతర్జాతీయ ఇండియన్ ఆయిల్ క్రీడాకారులు, జైలు అధికారుల సమక్షంలో, ఫేజ్ 7 పరివర్తన్- ప్రిజన్ టూ ప్రైడ్, ఫేజ్-4 నయీ దిశ - స్మైల్ ఫర్ జువెనైల్ ను ఇండియన్ ఆయిల్ ఛైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య ప్రారంభించారు. ఫేజ్ 7 పరివర్తన్, ఫేజ్ 4 నయీ దిశ కార్యక్రమాలను 11 జైళ్లు, 12 జువైనల్ హోమ్‌లకు విస్తరించనున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని విజయవాడతో సహా, 14 రాష్ట్రాల్లోని 1115 మంది ఇందులో భాగస్వాములు కానున్నారు. నగరంలోని జువెనైల్ వెల్ఫేర్, కరెక్షనల్ సర్వీసెస్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్ వేదికగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్టేట్ హెడ్ బి. అనిల్ కుమార్, డైరెక్టర్ బి.డి.వి ప్రసాద్ మూర్తి, ఏపీ ప్రభుత్వ జెడబ్ల్యూసీఎస్ అండ్ డబ్ల్యూఎస్సీ చీఫ్ ప్రొబేషన్ సూపరింటెండెంట్ టి. మధుసూదన్ రావ్, సూపరింటెండెంట్ రాంమోహన్ రెడ్డి, నయీ దిశ ఫేజ్ 4ని వర్చువల్‌గా శ్రీకాంత్ మాధవ్ వైద్య ప్రారంభించారు.

ఖేలో ఇండియా వర్సిటీ గేమ్స్‌కు నాగభువన ఎంపిక

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఈ నెల 21 నుండి 27 వరకు అస్సామ్ లో జరగబోయే "ఖేలో ఇండియ" యూనివర్సిటీ గేమ్స్ కు ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ కు చెందిన కర్రీ నాగ భువన ఎంపికైనట్లు అకాడమీ డైరెక్టర్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వర రావు తెలిపారు. ఈ నెల 6 నుండి 8 వరకు కురుక్షేత్రలో జరిగిన ఆల్ ఇండియా యూనివర్సిటీ నేషనల్ రైఫిల్ టింగ్ చాంపియన్షిప్ పోటీలో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో 573 పాయింట్స్ సాధించి ఈ టోర్నీ కి అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా నాగ భువనను అకాడమీ డైరెక్టర్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వర రావు శాల్ తో సత్కరించి, హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అకాడమీ షూటర్స్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఇన్స్పైర్ మనాక్ అవార్డు ప్రోగ్రాం పోటీలో బెజవాడ రాజారావు హైస్కూల్ ప్రతిభ

విశాలాంధ్ర-విజయవాడ వన్ టౌన్ : రాష్ట్రంలో 3448 ప్రాజెక్టులలో ఎన్టీఆర్ జిల్లా నుండి మొత్తం 143 ప్రాజెక్టులు సెలెక్ట్ చేయడం 28800 అందులో బెజవాడ రాజారావు హైస్కూల్ నుండి "రైలు ప్రమాదాల నివారణ" అనే ప్రాజెక్టును ఈ నెల 12 న ఆంధ్ర లయోల కాలేజి వేదికగా జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రదర్శించడం జరిగింది. ఈ ప్రాజెక్టుని 10 వ తరగతి విద్యార్థులు రంగాల హరిప్రియ, ధరావతు లిఖిత్ సాయి 565, సైన్స్ టీచర్ సహకారంతో తయారు చేసి ఎగ్జిబిషన్లో ప్రదర్శించారు. జిల్లా స్థాయిలో ఈ ప్రదర్శన చేసిన విద్యార్థులను, గైడ్ టీచర్ ని స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు .

ఎర్రంశెట్టి దుర్గా భవానీకి సన్మానం

విశాలాంధ్ర - విజయవాడ వన్ టౌన్ : జాతీయ మహిళా దినోత్సావం పురస్కరించుకుని బి ఆర్ టి ఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ లయన్స్ క్లబ్ జోన్ చైర్ పర్సన్ ఎర్రంశెట్టి దుర్గా భవాని నీ ఘనం గా సత్కరించారు,ఈ సందర్భముగా వాకర్స్ జిల్లా డిప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్ మాట్లాడుతూ సేవా రంగం లో తనదైన శైలి లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దుర్గా భవాని నీ అభినందించారు,ఈ కార్యక్రమం లో క్లబ్ కార్యదర్శి కొండాయ గుంట రాము, కోశాధికారి గుర్రం ఏడు కొండలు,సభ్యులు వి,విశ్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారంటీ

విశాలాంధ్ర-గూడూరు: పెడన నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొని కోకా నారాయణ పాలెం, అకుమర్రు గ్రామంలో మంగళవారం ఇంటింటికి తిరిగి భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేయడం జరిగింది, ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ ఈరోజు కోకా నారాయణ పాలెం గ్రామంలో చిగురిసెట్టి జ్వాలా, సుబ్బారావు తదితర 10 కుటుంబాల వారు ఈరోజు వైసీపీ ప్రభుత్వం చేసే ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు విసిగిపోయి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మహాశక్తి పథకాల ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని ఉద్దేశంతో ఈ ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కోకా నారాయణ పాలెం 10 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీ తీర్థం తీసుకోవడం జరిగింది. వీరు గతంలో వైసీపీ ప్రభుత్వానికి పనిచేశాం కానీ ఈరోజు జనసేన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వస్తేనే ఈ రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని ,ఉద్యోగ అవకాశాలు వస్తాయని వీరు కాగితకు చెప్పడం జరిగింది. అదేవిధంగా ఈరోజు భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా అకుమర్రు గ్రామంలో కూడా ఇంటింటికి వెళ్లి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ బాండ్లను వారికి పంచడం జరిగింది.. ఈ కార్యక్రమంలో భాగంగా రేపు రాబోయే రోజుల్లో జనసేన ...తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ఈ అవినీతి పాలన జగన్మోహన్ రెడ్డిని ఈ వైసీపీ నాయకులను ప్రజలు తిరస్కరించే రోజు త్వరలోనే ఉందని కాగిత అన్నారు ...ఈ రాష్ట్రంలో పరిశ్రమలు రావాలి అన్న, అమరావతి రాజధాని నిర్మించాలన్న, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్న జనసేన ...టిడిపి ప్రభుత్వం వస్తేనే అది సాధ్యపడుతుందని కాగిత అన్నారు .ఎంతో అనుభవం గల వ్యక్తి నారా చంద్రబాబునాయుడు అభివృద్ధికి చిహ్నంగా నిలిచారని ఈ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు గారు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల ద్వారా ఎంతో మార్పు వచ్చింది అని ఈ రాష్ట్ర ప్రజలకు ఒక నమ్మకం కలిగిందని కాగిత అన్నారు రేపు రాబోయే రోజుల్లో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టే ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు తెలియపరిచి అభివృద్ధి పథంలో ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తారు అని కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు ఈ కార్యక్రమంలో పోతన స్వామి, సాదరబోయిన ఏడుకొండల గారు కాసగాని శీను, గోపి నాగబాబు,రాము, ఏలేష్,బొర్రా శ్రీను మరియు టీడీపీ నేతలు, జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.